- అర్హులకు ప్రభుత్వ పథకాలు అందేలా చర్యలు
- భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు
- ప్రజా పాలన గ్రామ సభలు ప్రారంభం

పేదల కోసమే ఆరు గ్యారెంటీలు

గణపురం మండలం ధర్మారావుపేటలో జరిగిన ప్రజాపాలన కార్యక్రమంలో దరఖాస్తులను స్వీకరిస్తున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, కలెక్టర్ భవేశ్ మిశ్రా

భూపాలపల్లి రూరల్/ టేకుమట్ల/ చిట్యాల/ మొగుళ్లపల్లి/ రేగొండ, డిసెంబర్ 28 : రాష్ట్రంలోని పేద ప్రజలు సంతోషంగా ఉండాలనే ప్రభుత్వం ఆరు గ్యారెంటీల్లో భాగంగా ప్రజా పాలన కార్యక్రమం చేపట్టిందని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. గురువారం భూపాలపల్లి పట్టణం లోని రాంనగర్, గణపురం మండలం ధర్మారావుపేట, భూపాలపల్లి మండలం ఎస్ఎం కొత్తపెల్లి, టేకుమట్ల, చిట్యాల, మొగుళ్లపల్లి, రేగొండ, గోరికొత్తపల్లి మండల కేంద్రాల్లో నిర్వహించిన ప్రజాపాలన గ్రామ సభలకు కలెక్టర్ భవేశ్ మిశ్రాతో కలిసి ఎమ్మెల్యే పాల్గొన్నారు. గ్రామ సభలో ముందుగా ప్రజాపాలన కార్యక్రమం ఉద్ధేశాన్ని వివరిస్తూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రజలకు పంపిన సందేశాన్ని అధికారులు చదివి వినిపించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రెండు గ్యారెంటీలు అమలు చేశామన్నారు. గతంలో రైతుబంధు పథకం కింద అనర్హులకు లబ్ధి జరిగిందని, అర్హులైన పేదలందరికీ పథకాలు అందేలా చర్యలు చేపడతామని తెలిపారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలు తమ వివరాలు తెలియజేసి దరఖాస్తులు సమర్పించాలని, ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం లబ్ధిదారుల ఎంపిక ఉంటుందన్నారు. భూ సమస్యలను పరిష్కరించడానికి సర్వే చేపట్టి అర్హులైన వారికి పట్టాదారు పాస్ పుస్తకాలు అందజేస్తామని తెలిపారు. అనంతరం కేసీఆర్ ప్రభుత్వంలో అమలైన కల్యాణలక్ష్మి చెక్కులను చిట్యాల మండలంలోని 55 మంది లబ్ధిదారులకు అందజేశారు. వేర్వేరుగా జరిగిన కార్యక్రమాల్లో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, డీఎస్పీ రాములు, కౌన్సిలర్ దాట్ల శ్రీనివాస్, ఎంపీపీ రజిత, ఎంపీటీసీ లావణ్య, సర్పంచ్ ఆగమ్మ, మండల ప్రత్యేక అధికారులు పురుషోత్తం, ఆశాలత, టేకుమట్ల జడ్పీటీసీ పులి తిరుపతిరెడ్డి, వైస్ ఎంపీపీ ఐలయ్య, సర్పంచ్ సరోత్తంరెడ్డి, ఎంపీటీసీ ఆది సునీత, ప్రత్యేక అధికారి శైలజ, ఎంపీడీవో అనిత, తహసీల్దార్ మంజుల, ఎంపీవో సురేశ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సతీశ్‌గౌడ్, చిట్యాల మండల స్పెషల్ ఆఫీసర్, జడ్పీ సీఈవో విజయలక్ష్మి, ఎంపీపీ దావు వినోదా వీరారెడ్డి, జడ్పీటీసీ గొర్రె సాగర్, తహసీల్దార్ సుమన్, ఎంపీడీవో రామయ్య, ఎంపీవో రామకృష్ణ, కాంగ్రెస్ జిల్లా ప్రధానకార్యదర్శి ముకిరాల మధుసూదన్‌రెడ్డి, పార్టీ మండలాధ్యక్షుడు గూట్ల తిరుపతి, వర్కింగ్‌ప్రెసిడెంట్ మూల శంకర్, సర్పంచ్ పూర్ణ చందర్‌రావు, ఎంపీటీసీలు దబ్బెట అనిల్, కట్కూరి పద్మ, మొగుళ్లపల్లి మండల ప్రత్యేకాధికారి సునీత, ఎంపీపీ యార సుజాతా సంజీవరెడ్డి, ఎంపీడీవో కృష్ణవేణి, తహసీల్దార్ సునీత, సర్పంచ్ మోటె ధర్మారావు, రేగొండ మండల ప్రత్యేకాధికారి సామేల్, ఎంపీడీవో సురేందర్‌గౌడ్, తహసీల్దార్లు సత్యనారాయణస్వామి, రవికుమార్, ఏవో వాసుదేవారెడ్డి, జడ్పీటీసీ సాయిని విజయ, ఎంపీపీ పున్నం లక్ష్మి, సర్పంచులు ఏడునూతుల నిషిధర్‌రెడ్డి, రజిత పాల్గొన్నారు. అలాగే భూపాలపల్లి పట్టణంలోని సుభాష్‌కాలనీ, రాంనగర్‌లో కొనసాగుతున్న ప్రజాపాలన నిర్వహణ తీరును, పోలీస్ బందోబస్తును ఎస్పీ కిరణ్ ఖరే క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఆయన వెంట భూపాలపల్లి సీఐ రాంనర్సింహారెడ్డి, కౌన్సిలర్లు దాట్ల శ్రీనివాస్ రావు, ముంజంపెల్లి మురళీధర్ ఉన్నారు.

భూపాలపల్లి రూరల్ : రాంనగర్‌లో ప్రజాపాలన దరఖాస్తుల తీరును పరిశీలిస్తున్న ఎస్పీ కిరణ్ ఖరే

- ములుగు కలెక్టర్ ఇలా త్రిపాఠి
- తాడ్వాయి, గోవిందరావుపేట మండలాల్లో గ్రామ సభల పరిశీలన

'ప్రజా పాలన'ను సద్వినియోగం చేసుకోవాలి

తాడ్వాయి: ప్రజలతో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

ములుగు రూరల్ : ములుగు మండలంలోని ముద్దునూరు తండాలో దరఖాస్తులను పరిశీలిస్తున్న ఎస్పీ గౌష్‌ఆలం

గోవిందరావుపేట/ తాడ్వాయి/ ములుగు రూరల్/ వెంకటాపూర్, డిసెంబర్ 28 : ప్రజా పాలన గ్రామ సభలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. గురువారం గోవిందరావుపేట మండలం రాఘవపట్నం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం, తాడ్వాయి మండలంలోని వెంగళపురం, వెంకటాపూర్ మండలం మల్లయ్యపల్లి, లింగాపూర్, చక్రవర్తిపల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన దరఖాస్తుల స్వీకరణ కేంద్రాలను గురువారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సభలు నిర్వహించేందుకు జిల్లాలో 36 బృందాతో కౌంటర్లు ఏర్పాటు చేశామన్నారు. ప్రతి రోజూ వచ్చే దరఖాస్తులను అధికారులు సంబంధిత మండల ప్రత్యేక అధికారులకు అప్పగించి రిజిస్టర్లలో నమోదు చేయాలని సూచించారు. రేషన్‌కార్డు ఉంటేనే దరఖాస్తు చేసుకోవాలనే నిబంధనలు లేవని, ఆదార్‌కార్డు జిరాక్స్ ద్వారా కూడా అప్లయ్ చేసుకోవచ్చునని, వదంతులు నమ్మి ప్రజలు ఆందోళన చెందవద్దన్నారు. గ్రామాల్లో లేని వారి కోసం ప్రతి నాలుగు నెలలకు ఒకసారి దరఖాస్తులు తీసుకుంటామని, స్వీకరించిన దరఖాస్తులను అధికారులు భద్రపరచాలని ఆదేశించారు. నిరక్షరాస్యులకు అధికారులే ఫారంను నింపాలని, రేషన్ కార్డు లేని వారి కోసం ప్రత్యేక కౌంటర్‌లు ఏర్పాటు చేసి దరఖాస్తులు స్వీకరించాలని అన్నారు. ఆరు గ్యారెంటీలను పొందేందుకు కుటుంబం నుంచి ఒక దరఖాస్తు మాత్రమే సమర్పించాలని ప్రజలకు సూచించారు. వెంకటాపూర్ మండలం మల్లయ్యపల్లిలో 180, చక్రవర్తిపల్లెలో 160, లింగాపూర్‌లో 72 దరఖాస్తులు వచ్చాయని మండల స్పెషల్ ఆఫీసర్ శ్రీపతి, ఎంపీడీవో శ్రీనివాస్ తెలిపారు. డీఎంహెచ్‌వో, తాడ్వాయి మండల ప్రత్యేక అధికారి డాక్టర్ అల్లెం అప్పయ్య, ఎంపీవో సాజిదా బేగం, ఏఈ కాంత్రి, ఏఈవో ధరమ్‌సింగ్, ఏపీఎం నాగేశ్వర్‌రావు, సూపర్‌వైజర్ అనంతలక్ష్మి, విద్యుత్ శాఖ డీఈ నాగేశ్వర్‌రావు , వెంకటాపూర్ తహసీల్దార్ శివకుమార్ ఉన్నారు. అలాగే ములుగు మండలం అంకన్నగూడెంలో డీఆర్‌డీఏ నాగపద్మజ, బంజరుపల్లిలో ఎంపీవో రహీముద్దీన్, బరిగలాన్‌పల్లిలో తహసీల్దార్ విజయ్‌భాస్కర్, ముద్దునూరుతండాలో ఎంపీడీవో ఎక్బాల్ హుస్సేన్ ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. కాగా, మద్దునూరు తండాలో జరిగిన దరఖాస్తుల స్వీకరణ శైలిని ఎస్పీ గౌష్‌ఆలం పరిశీలించారు. ఆయా గ్రామాల్లోని గ్రామ పంచాయతీ వేదికగా జరిగిన స్వీకరణ కార్యక్రమంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

బైక్ అదుపు తప్పి వ్యక్తి మృతి

మహాముత్తారం, డిసెంబర్28 : బైక్ అదుపుతప్పి వ్యక్తి మృతి చెందిన సంఘటన బుధవారం రాత్రి జరిగింది. ఎస్సై సుధాకర్ కథనం ప్రకారం.. మండలంలోని బోర్ల గూడెం గ్రామానికి చెందిన ముకులోత్ సమ్మయ్యనాయక్ (55) పెగడపల్లిలో ఫంక్షన్‌కు వెళ్లి తిరిగి వస్తున్నాడు. ఈ క్రమంలో బోర్ల గూడెం శివారు హనుమాన్ ఆలయం వద్ద బైక్ అదుపు తప్పి పక్కనే ఉన్న కల్వర్టును ఢీకొంది. దీంతో సమ్మయ్యనాయక్ తల, కాలుకు తీవ్ర గాయం కావడంతో రక్తస్రావమై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మిల్లులో అగ్ని ప్రమాదం

ములుగు రూరల్, డిసెంబర్ 28 : షార్ట్ సర్క్యూట్‌తో జిన్నింగ్ మిల్లులో అగ్నిప్రమాదం జరిగిన సంఘటన ములుగు మండలం జాకారంలో చోటు చేసుకుంది. ఫైర్ అధికారులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గురువారం మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో పత్తి బేళ్లను ప్రెస్సింగ్ చేస్తున్న క్రమంలో మోటర్‌లో షార్ట్ సర్క్యూట్ జరిగి పత్తికి మంటలు వ్యాపించాయి. మిల్లు యజమానులు అందించిన సమాచారంతో ములుగుతో పాటు పరకాల నుండి ఫైర్ ఇంజిన్లను రప్పించి మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. ఈ ప్రమాదంలో సుమారు రూ. 60 లక్షల పత్తి దగ్ధమైందని ములుగు ఫైర్ ఆఫీసర్ రహీం తెలిపారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

CHANGE OF NAME

I, **CHERALA VASAVI** (New Name), previously called **VALUSA VASAVI, W/o. ANIL KUMAR** (Old Name), and R/o. H.No. 16-4-840/C, Shivanagar, Warangal City and District, -506002, T.S., India. and solemnly declare. both are same.

WANTED

jobs Apply Now!

★Wanted Experienced Lab-Technician, Pharmacist, PRO & Superwiser to Work at SRI SRI CARDIAC CENTER, Hanumakonda, Contact: 9966653521, 8639082085.

NTW-5682

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా వివాంచు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777618
9182777213
WARANAGAL
9182777556
9182777557
9182777558
JAYASHANKAR BHUPALPALLY
9182777559
MULUGU
9182777135
MAHABUBABAD
9182777554
JANGAON
9182777565

ప్రారంభమైన ప్రజా పాలన

- ములుగు, భూపాలపల్లి జిల్లాల్లో దరఖాస్తుల స్వీకరణ
- పాల్గొన్న ప్రత్యేకాధికారులు, ప్రజాప్రతినిధులు, సిబ్బంది

గోవిందరావుపేట : కర్లపల్లిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్ : రాష్ట్ర ప్రభుత్వం ఐదు గ్యారెంటీల అమలులో భాగంగా చేపట్టిన ప్రజాపాలన గురువారం ములుగు, భూపాలపల్లి జిల్లాల్లో ప్రారంభమైంది. పట్టణంలోని పలు వార్డులు, గ్రామాల్లో మొదటి రోజు ప్రత్యేక అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ప్రజాప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శులు, ఇతర సిబ్బంది కౌంటర్లను ఏర్పాటు చేసి ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. అడిషనల్ కలెక్టర్లు, జిల్లా, నియోజకవర్గ ప్రత్యేకాధికారులు సందర్శించి ప్రజాపాలనను పరిశీలించారు. గోవిందరావుపేట మండలంలోని సోమలగడ్డలో తహసీల్దార్ రాజ్‌కుమార్, రంగాపూర్‌లో ఎంఎస్‌వో వెంకయ్య, కర్లపల్లిలో ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, రాఘవపట్నంలో ఎంపీవో సాజిదాబేగం దరఖాస్తులను స్వీకరించారు. మంగపేట మండలంలోని నిమ్మగూడెంలో ఎస్సీ కార్పొరేషన్ ఈడీ, మండల ప్రత్యేకాధికారి తుల రవి, బుచ్చంపేటలో తహసీల్దార్ వీరస్వామి, నర్సాయిగూడెంలో ఎంపీడీవో శ్రీధర్, దోమెడలో ఎంపీవో మమత ఆధ్వర్యంలో స్వీకరించగా, సీఐ రాజు, ఎస్సై రవికుమార్, ఏవో చేరాలుతదితరులు పాల్గొన్నారు. కన్నాయిగూడెం మండలంలోని కంతనపల్లిలో ఎంపీపీ జనగం సమ్మక్క, జడ్పీటీసీ నామ చందు దరఖాస్తుల స్వీకరణను ప్రారంభించారు. వాజేడు మండలంలోని దూలపురం, పెద్దగొల్లగూడెం, పూసూరు, టేకులగూడెం జీపీల్లో జరిగిన ప్రజాపాలనను ఎస్పీ గౌష్‌ఆలం, అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) వేణుగోపాల్ పరిశీలించారు. నాలుగు గ్రామాల్లో మొత్తం 610 దరఖాస్తులు స్వీకరించినట్లు ఎంపీవో శ్రీకాంత్ నాయుడు తెలిపారు. ఏటూరునాగారం ఏఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, మండల ప్రత్యేకాధికారి సర్దార్‌సింగ్, తహసీల్దార్ శ్రీరాముల శ్రీనివాస్, ఎంపీడీవో విజయ, ఎస్సై వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. మహాదేవపూర్ మండలంలోని రాపల్లికోట, కుదురుపల్లి, కాళేశ్వరం, అన్నారం, పలుగుల, కన్నెపల్లి, మద్దులపల్లి గ్రామాల్లో దరఖాస్తులు స్వీకరించారు. కుదురుపల్లి, రాపల్లికోటలో డీఎల్‌పీవో సుధీర్‌కుమార్, ఎంపీడీవో రవీంద్రనాథ్, ఎంపీవో ప్రసాద్ పరిశీలించారు. కన్నెపల్లిలో తహసీల్దార్ లక్ష్మీరాజ్యం, ఎంపీటీసీ మమత ప్రారంభించారు. అలాగే మల్హర్ మండలంలోని మల్లంపల్లి, దుబ్బపేట, ఇప్పలపల్లి, కొండంపేట, చిన్నతూండ్ల, అడ్వాలపల్లి గ్రామాల్లో దరఖాస్తులు స్వీకరించారు. పలిమెల మండలంలోని పలు గ్రామాల్లో దరఖాస్తులు స్వీకరించగా మండల ప్రత్యేకాధికారి విజయభాస్కర్ పరిశీలించారు.

మహదేవపూర్ : దరఖాస్తులు స్వీకరిస్తున్న డీఎల్‌పీవో సుధీర్ కుమార్

భూపాలపల్లి జిల్లాలో 4,858, ములుగులో 4,420 దరఖాస్తుల స్వీకరణ

ములుగు, డిసెంబర్ 28 (నమస్తేతెలంగాణ)/ భూపాలపల్లి రూరల్ : జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాల్లో నిర్వహించిన ప్రజా పాలన గ్రామ సభల్లో ప్రజల నుంచి 9,278 దరఖాస్తులు స్వీకరించారు. భూపాలపల్లి జిల్లాలో మండలాల వారిగా దరఖాస్తుల వివరాలను కలెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు. భూపాలపల్లి మండలంలో 229 దరఖాస్తులు, చిట్యాల 380, గణపురం 282, కాటారం 462, మహదేవపూర్ 632, మల్హర్‌రావు 294, మొగుళ్లపల్లి 212, మహాముత్తారం 244, రేగొండ 399, పలిమెల 147, టేకుమట్ల 461, భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలో 1,116 దరఖాస్తులు మొదటి రోజు వచ్చాయన్నారు. ములుగు జిల్లాలో తొలి రోజు మొత్తం 5,700 కుటుంబాల నుంచి దరఖాస్తులు స్వీకరించాల్సి ఉండగా 4,420 కుటుంబాలు దరఖాస్తులు ఇవ్వగా వాటిని అధికారులు తీసుకొని భద్రపరిచారు.

ప్రజా పాలనను పరిశీలించిన అడిషనల్ కలెక్టర్లు

ఏటూరునాగారం, డిసెంబర్ 28 : ఏటూరునాగారం మండలంలోని అల్లంవారి ఘనపూర్, చెల్పాక గ్రామ పంచాయతీల్లో గురువారం ప్రజాపాలన ప్రారంభం కాగా అడిషనల్ కలెక్టర్ శ్రీజ సందర్శించారు. ప్రతి దరఖాస్తును స్వీకరించాలని ఈ సందర్భంగా అధికారులను ఆమె ఆదేశించారు. కార్యక్రమంలో ప్రత్యేకాధికారి ప్రసూనారాణి, ఎంపీడీవో కుమార్, తహసీల్దార్ సృజన్‌కుమార్ ఎంపీటీసీ కోట నర్సింహులు, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ప్రాధాన్యత ఇవ్వాలి

వెంకటాపురం (నూగూరు)/కన్నాయిగూడెం : ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణలో దివ్యాంగులు, వృద్ధులకు ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేసి ప్రాధాన్యతనివ్వాలని ములుగు అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) వేణుగోపాల్ అన్నారు. గురువారం ఆయన వెంకటాపురం మండలంలోని బీసీ మర్రిగూడెం, నూగూరు, రాచపల్లి, కన్నాయిగూడెం మండలంలోని చింతగూడెం, కంతనపల్లి జీపీల్లో నిర్వహిస్తున్న ప్రజాపాలనను పరిశీలించారు. ఆయన వెంట ప్రత్యేకాధికారులు అరవిందకుమార్‌రెడ్డి, వెంకటనారాయణ, తహసీల్దార్లు సరికొమ్ముల సమ్మయ్య, సలీం, ఎంపీడీవోలు అడూరి బాబు, ఫణిచంద్ర, ఎంపీవోలు హనుమంతరావు, రామకృష్ణ, ఏవో గుంటక నర్సింహారావు, బొల్లె భాస్కర్ తదితరులున్నారు.

అధికారులతో మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ శ్రీజ

మంజూరైన పనులను పూర్తి చేయాలి

తాడ్వాయి, డిసెంబర్ 28 : గ్రామాభివృద్ధి కోసం మంజూరు చేసిన పనులను వెంటనే ప్రారంభించి పూర్తి చేయాలని ములుగు కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. మండలంలోని బయ్యక్కపేటలో గురువారం జరిగిన గ్రామసభకు ఐటీడీఏ పీవో అంకిత్‌తో కలిసి ఆమె హాజరయ్యారు. అనంతరం గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామానికి నాలుగగు సీసీ రోడ్లను మంజూరు చేశామని, వాటిని పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. పనుల విషయంలో అవగాహనకు వచ్చి నివేదికను సమర్పించాలని గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, పంచాయతీ కార్యదర్శికి సూచించారు. అనంతరం మేడారంలో జీపీ భవన నిర్మానానికి స్థల పరిశీలన చేశారు. కలెక్టర్ వెంట పీఆర్ ఈఈఅజయ్ తదితరులున్నారు.

సఖీ కేంద్రాన్ని సందర్శించిన ఎస్పీ కిరణ్ ఖరే

కృష్ణకాలనీ, డిసెంబర్ 28 : జిల్లా కేంద్రంలో సఖీ కేంద్రాన్ని ఎస్పీ కిరణ్ ఖరే గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లాలోని బాధిత మహిళలకు అందిస్తున్న సేవలను సఖీ కేంద్రం అడ్మిన్ గాయత్రిని అడిగి తెలుసుకున్నారు. అలాగే రెండు రోజులుగా ఉంటున్న బాధిత మహిళను పలుకరించి, సమస్యను అడిగి తెలుసుకున్నారు. త్వరగా సమస్యను పరిష్కరించాలని గాయత్రికి సూచించారు. అనంతరం సఖీ సేవల పోస్టర్ ఆవిష్కరించి, సఖీ సెంటర్ అందిస్తున్న సేవలను తెలుసుకొని సిబ్బందిని అభినందించారు. కౌన్సిలర్ చల్లూరి మమతా కమలాకర్, భూపాలపల్లి సీఐ రాంనర్సింహారెడ్డి, సఖీ సిబ్బంది కౌటం కృష్ణపటేల్ పాల్గొన్నారు.

30న ఎమ్మెల్సీ కవిత పర్యటన

ములుగు రూరల్, డిసెంబర్ 28 : ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఈ నెల 30న జిల్లాలో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా ఆమె ములుగులోని గట్టమ్మ దేవాలయంతో పాటు మేడారం సమ్మక్క-సారలమ్మలను దర్శించుకోనున్నట్లు గురువారం ఎంపీపీ గండ్రకోట శ్రీదేవీ సుధీర్‌యాదవ్ తెలిపారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మీనర్సింహారావు ఆదేశాల మేరకు మండలంలోని నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, అనుబంధ సంఘాల సభ్యులు తరలివచ్చి కవిత పర్యటనను విజయవంతం చేయాలని ఆమె పిలుపునిచ్చారు.

రెండు మోటర్లతో దేవాదుల పంపింగ్

కన్నాయిగూడెం, డిసెంబర్ 28 : మండలంలోని దేవాదుల ఎత్తిపోతల ప్రాజెక్టులోని రెండు మోటర్ల ద్వారా నీటి పంపింగ్‌ను గురువారం ప్రారంభించారు. ఫేస్ 3లో ఏర్పడిన సాంకేతిక సమస్యను పునరుద్ధరించినట్లు అధికారులు తెలిపారు. దీంతో ఫేస్ 2 నుంచి ఒకటి, ఫేస్ 3 నుంచి మరో మోటర్‌ను ఆన్ చేసి పంపింగ్ చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు దేవాదుల మోటర్ల ద్వారా 4.499 టీఎంసీల నీటిని పంపింగ్ చేసినట్లు అధికారులు పేర్కొన్నారు.

బలహీన వర్గాల సంక్షేమమే ధ్యేయం

కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు అశోక్

వేడుకల్లో మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు అశోక్

గోవిందరావుపేట, డిసెంబర్ 28 : బడుగు, బలహీనవర్గాల సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయమని ఆ పార్టీ ములుగు జిల్లా అధ్యక్షుడు, పీసీసీ ప్రధాన కార్యదర్శి పైడాకుల అశోక్ అన్నారు. గురువారం కాంగ్రెస్ 139వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని ఇందిరమ్మ విగ్రహం వద్ద పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం మండల అధ్యక్షుడు పాలడుగు వెంకటకృష్ణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి అశోక్ హాజరై మాట్లాడుతూ తొలి ప్రధానిగా జవహర్‌లాల్ నెహ్రూ ఎన్నికయ్యారని, దేశం కోసం ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీ ప్రాణాలర్పించారని, వారి కుటుంబమంతా ప్రజా సేవకే అంకితమయ్యిందని అన్నారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు సీఎం రేవంత్‌రెడ్డి 6 గ్యారెంటీలను అమలు చేస్తారని వివరించారు. అభివృద్ధిలో జిల్లాను రాష్ట్రంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా మంత్రి సీతక్క ముందుకు సాగుతున్నారని అశోక్ తెలిపారు. కార్యక్రమంలో నాయకులు దాసరి సుధాకర్, జెట్టి సోమయ్య, పెండెం శ్రీకాంత్, జయమ్మ, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలను పరిష్కరించాలి

కాటారం, డిసెంబర్ 28: విద్యారంగ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి దామెర కిరణ్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో గురువారం ఎస్ఎఫ్ఐ కాటారం డివిజన్ మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా కిరణ్ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్ బకాయిలను విడుదల చేయాలన్నారు. కాటారం డివిజన్ కేంద్రంలో ఎస్సీ, బీసీ, జనరల్ బాలుర హాస్టల్‌ను ఏర్పాటు చేయాలన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు బొడ్డు స్మరణ్ ఆధ్వర్యంలో డివిజన్ నూతన కమిటీ ఏర్పాటు చేశారు. అధ్యక్షుడిగా గోమాస నరేశ్, కార్యదర్శిగా బొడ్డు కిశోర్‌ను నియమించారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి కుమ్మరి రాజు, సభ్యులు తరుణ్, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

పార్కింగ్ స్థలాలను త్వరగా పూర్తిచేయాలి

ఐటీడీఏ పీవో అంకిత్

వరదల కారణంగా దెబ్బతిన్న రోడ్లను పరిశీలిస్తున్న పీఓ అంకిత్

తాడ్వాయి, డిసెంబర్ 28 : మేడారం మహాజాతర ప్రాంగణంలో పార్కింగ్ స్థలాలను త్వరగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని ఏటూరునాగారం ఐటీడీఏ పీవో అంకిత్ పీఆర్ అధికారులను ఆదేశించారు. వన దేవతలు సమ్మక్క, సారలమ్మలను ముందస్తుగా దర్శించుకునేందుకు భక్తులు భారీగాతరలివచ్చే అవకాశం ఉందని, వారి వాహనాలతో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. గురువారం ఆయన మేడారంలో పంచాయతీ రాజ్ ఆధ్వర్యంలో చేపట్టిన పార్కింగ్ స్థలాలు, వీఐపీ, వీవీఐపీ పార్కింగ్ దారుల మరమ్మతులు, కల్వర్టుల నిర్మాణం, కాల్వపల్లి రోడ్డు నుంచి ఆర్ఎఫ్ వరకు రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెట్ల తొలగింపు పనులను అధికారులతో కలిసి పరిశీలించారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని పీఆర్ డీఈ రవీందర్‌కు సూచించారు.

కాల్వపల్లి ఆశ్రమ పాఠశాల తనిఖీ

మండలంలోని కాల్వపల్లి ఆశ్రమ బాలుర పాఠశాలను గురువారం పీవో అంకిత్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. కంప్యూటర్ ల్యాబ్‌ను పరిశీలించి చేపట్టిన మరమ్మతు పనుల పురోగతిని వార్డెన్‌ను అడిగి తెలుసుకున్నారు.

కేసుల పరిష్కారానికి కృషి చేయాలి

ములుగు రూరల్/కృష్ణకాలనీ, డిసెంబర్ 28 : ఈ నెల 30న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో న్యాయవాదులు, పోలీసు అధికారులు పెండింగ్ కేసుల పరిష్కారానికి కృషి చేయాలని ములుగు, భూపాలపల్లి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ వైర్మన్లు పీవీపీ లలితాశివజ్యోతి, పీ నారాయణబాబు అన్నారు. గురువారం వారు తమ కార్యాలయాల్లో పోలీసు అధికారులు, బార్ అసోసియేషన్ సభ్యులతో సమావేశం నిర్వహించారు. లోక్ అదాలత్‌పై కక్షిదారులకు అవగాహన కల్పించి రాజీ మార్గం ద్వారా అత్యధిక కేసుల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. సమావేశంలో న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శులు టీ మాధవి, కే జయరాంరెడ్డి, న్యాయమూర్తులు రామ్మోహన్‌రెడ్డి, సౌఖ్య, న్యాయవాదులు మహేందర్, వినయ్‌కుమార్, వెంకటేశ్వర్‌రావు, భిక్షపతి, సునీల్‌కుమార్, స్వామిదాస్, రాంసింగ్, రాజ్‌కుమార్, రాజేందర్, సుధాకర్, అర్చన, మానస, డీఎస్పీలు రవీందర్, సుభాష్‌బాబు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి

ఏటూరునాగారం, డిసెంబర్ 28 : మండల కేంద్రంలోని ఆకులవారిఘనపూర్‌కు చెందిన మల్యాల అనిల్‌కుమార్ (26) రోడ్డు ప్రమాదానికి గురై చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని రొయ్యూరుకు చెందిన స్నేహితుడు కరీంతో కలిసి అనిల్‌కుమార్ ద్విచక్ర వాహనంపై బుధవారం హనుమకొండ వెళ్లారు. రాత్రి తిరిగి ఏటూరునాగారానికి వస్తున్న క్రమంలో ములుగు మండలం మల్లంపల్లి సమీపంలో రోడ్డు డివైడర్‌కు ఢీకొని ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. తలకు బలమైన గాయాలు కావడంతో అనిల్‌ను వరంగల్‌కు తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. కాగా, మృతుడు కొద్ది రోజులుగా ఆధార్ కేంద్రంలో తాత్కాలిక ఆప